BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 05 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4

## జూరాలకు భారీ వరద..

- 14 గేట్లు ఎత్తివేత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి ప్రవేశిస్తున్న వరద నీటి ప్రవాహం (ఇన్ ఫ్లో) 1,15,000 క్యూసెక్కులకు చేరింది. వరద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమై 14 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, స్పిల్‌వే ద్వారా 95,566 క్యూసెక్కులు, పవర్ హౌస్ ద్వారా 29,494 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. భీమా లిఫ్ట్-I - 650, కొయిలసాగర్ లిఫ్ట్ -315, ఎడమ కాల్వ - 550, కుడి కాల్వ (RMC) -290, పారలల్ కెనాల్ (భీమా లిఫ్ట్-II) - ద్వారా 750 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ఇతర డిమాండ్లను కలుపుకుని మొత్తం 1,27,659 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టు నుంచి బయటకు వెళ్తోంది.జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు (9.657 టీఎంసీలు సామర్థ్యం) కాగా, ప్రస్తుతం నీటిమట్టం317.680 మీటర్ల వద్ద ఉంది. మొత్తం నీటి నిల్వ 7.991 టీఎంసీలుగా ఉండగా, అందులో లైవ్ స్టోరేజ్ 4.284 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు దిగువన నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఆర్టీసీ బస్సుల్లో ఉచిత వైఫై సేవలు

- ప్రయాణికుల సౌకర్యం కోసం డిజిటల్ రవాణా వైపు అడుగులు
- రాష్ట్రవ్యాప్తంగా బస్సులు, బస్‌స్టాప్‌లలో ఇంటర్నెట్ సౌకర్యం




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రజారవాణా వ్యవస్థను ఆధునికీకరించడమే కాకుండా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సులు, బస్‌స్టాప్‌లలో ఉచిత వైఫై సేవలను అందుబాటులోకి తేవాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఈ డిజిటల్ ప్రాజెక్టును అమలు చేయడానికై ఆర్టీసీ ఒక ప్రైవేటు ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తూనే గానీ, బస్‌స్టాప్‌లలో వేచిచూస్తూనే గానీ నిరాటంకంగా ఇంటర్నెట్‌ను వినియోగించుకునేలా ఈ ప్రణాళిక రూపొందించబడింది.

రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో జరిగిన సమీక్ష సమావేశంలో, ఆర్టీసీ ఉన్నతాధికారులు ఈ ప్రాజెక్టు ప్రతిపాదనను వివరించారు. ప్రయాణికులకు కలిగే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మంత్రి ఈ ప్రాజెక్టుకు అధికారిక ఆమోదం తెలిపారు. దీంతో ప్రాజెక్టు అమలుకు తొలి అడుగు పడింది. వైఫై సేవల మొదటి దశలో ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఉచితంగా సినిమాలు, పాటలు వంటి వినోద కార్యక్రమాలను వీక్షించగలుగుతారు. తరువాతి దశల్లో పూర్తి స్థాయి ఇంటర్నెట్ బ్రౌజింగ్ సౌకర్యం కూడా అందించనున్నట్లు సమాచారం.ఈ ప్రాజెక్టు ప్రకటనల ఆధారంగా ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఉండేలా రూపొందించబడింది. వైఫై వినియోగ సమయంలో వినియోగదారులు కొన్ని ప్రకటనలను తప్పనిసరిగా వీక్షించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ద్వారా ఆర్టీసీకి అదనపు ఆదాయం లభించే అవకాశం ఉండగా, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌తో ఆదాయం పంచుకునే విధానాన్ని కూడా ఆమోదించారు.

## రాష్ట్రంలో 13 పార్టీలకు ఈసీ షాక్




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పలు రాజకీయ పార్టీలపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక చర్యలు చేపట్టింది. గత ఆరేళ్లుగా ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా, కేవలం రిజిస్టర్డ్ పార్టీలుగా మాత్రమే కొనసాగుతున్న 13 పార్టీలకు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో స్పష్టమైన కారణాలతో వివరణ ఇవ్వాలని ఈ నోటీసుల్లో ఆదేశించింది.

రాష్ట్రంలో ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ అయి ఉండి ఆరేళ్లకు పైగా ఏ ఎన్నికల బరిలోనూ నిలవని పార్టీలను జాబితా నుంచి తొలగించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగానే 13 పార్టీలను గుర్తించి చర్యలు ప్రారంభించింది. ఈ విషయంపై దినపత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇవ్వాలని కూడా జిల్లా అధికారులను ఆదేశించింది. ఆయా పార్టీల నుంచి వివరణ స్వీకరించిన తర్వాత, వాటి గుర్తింపును రద్దు చేయాలా వద్దా అనే దానిపై స్పష్టమైన సిఫార్సులతో కూడిన నివేదికను ఈ నెల 10వ తేదీలోగా సమర్పించాలని స్పష్టం చేసింది. జిల్లాల నుంచి అందిన నివేదికల ఆధారంగా తుది నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.

### నోటీసులు అందుకున్న పార్టీల వివరాలు

తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ (హన్మకొండ)
ఇండియన్ మైనారిటీస్ పొలిటికల్ పార్టీ (హైదరాబాద్)
జాగో పార్టీ (హైదరాబాద్)
నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (హైదరాబాద్)
తెలంగాణ లోక్ సత్తా పార్టీ (హైదరాబాద్)
తెలంగాణ మైనారిటీస్ ఓబీసీ రాజ్యం (హైదరాబాద్)
యువ పార్టీ (హైదరాబాద్)
బహుజన్ సమాజ్ పార్టీ (అంబేద్కర్-పూలే) (మేడ్చల్ మల్కాజిగిరి)
తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ (మేడ్చల్ మల్కాజిగిరి)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్య సమితి పార్టీ (రంగారెడ్డి)
జాతీయ మహిళా పార్టీ (రంగారెడ్డి)
యువ తెలంగాణ పార్టీ (రంగారెడ్డి).
13. తెలంగాణ ప్రజా సమితి (కిషోర్, రావు, కిషన్) (వరంగల్)

## ఘోర రోడ్డు ప్రమాదం

- అగ్నికి ఆహుతైన ముగ్గురు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జాతీయ రహదారి పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్ రాష్ట్రం జోద్‌పూర్‌కు చెందిన రాజురాం చౌదరి తన కుమారుడు సర్వణ్ రాం (23)తో కలిసి రెండు లారీల్లో విజయవాడ నుండి చేపల దాణా తీసుకొని బయలుదేరారు. వీరిలో కుమారుడు నడుపుతున్న లారీ ముందుగా వెళ్తుండగా, పది నిమిషాల తర్వాత తండ్రి వెనుక లారీలో ప్రయాణిస్తున్నాడు. ఇక వేరొక వైపు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి మండలానికి చెందిన గుగులోత్ గణేష్ (30) కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడ్‌తో కాకినాడకు వెళ్తున్నాడు. ఎల్లంపేట స్టేజీ వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఢీకొన్న అనంతరం రాళ్లు క్యాబిన్లపైకి దూసుకెళ్లడంతో మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో డ్రైవర్లు గుగులోత్ గణేష్, సర్వణ్ రాం మరియు క్లీనర్ బర్గత్ ఖాన్ (23) అక్కడికక్కడే దహనమయ్యారు. సమాచారం అందుకున్న స్థానికులు పోలీసులకు తెలియజేయగా, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో గుర్తుపట్టలేని స్థితికి చేరుకున్నాయి. వెనుక వస్తున్న తండ్రి రాజురాం తన కుమారుడి వాహనమే ప్రమాదానికి గురైందని గుర్తించారు. మృతుడు గణేష్‌కు భార్య అనసూర్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్లీనర్ బర్గత్ ఖాన్ ఇటీవలే వివాహం చేసుకున్నాడు.ఘటన కారణంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు రెండు గంటల పాటు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సీఐ రాజ్ కుమార్, ఎస్ఐలు బొలగాని సతీష్, గండ్ర సంతోష్‌లు జెసిబి సహాయంతో దహనమైన లారీలను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మృతుడు గణేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు పోలీసులు తెలిపారు.

## ఆన్‌లైన్‌లోనూ శ్రీశైలం ఉచిత స్పర్శ దర్శనం టికెట్లు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



శ్రీశైలం మల్లికార్జున స్వామి ఉచిత స్పర్శ టోకెన్లు ఇక నుంచి ఆన్‌లైన్‌లోనూ తీసుకోవచ్చని దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం 1.45గంటల నుంచి 3.45గంటల వరకు ఉచిత స్పర్శ దర్శనం ఉంటుందని తెలిపారు.ఈ టోకెన్లను www.srisailadevasthanam.org, www.aptmples.ap.gov.in వెబ్‌సైట్లలో పొందవచ్చని చెప్పారు. ఒకరోజు ముందుగా కూడా దర్శనం టోకెన్లు తీసుకోవచ్చని తెలిపారు.

## టీవీకే పార్టీ సీఎం అభ్యర్థిగా విజయ్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం పార్టీ తరపున సినీ నటుడు విజయ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు శుక్రవారం చెన్నైలో పార్టీ ప్రకటించింది. డీఎంకే, బీజేపీలతో ఎలాంటి పొత్తు ఉండదని ఆయన స్పష్టం చేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు సెప్టెంబరు నుండి ప్రచారం ప్రారంభించనున్నారు. కచతీవు, ద్విభాషా విధానం, హిందీ రుద్దింపు వంటి అంశాలపై పార్టీ కీలక తీర్మానాలు ఆమోదించింది.

## మణిపూర్ వదిలేసి
# మోడీ విదేశీ పర్యటనలు

- ఐదేళ్లలో 42 దేశాలకు పర్యటన
- సెక్యులర్ పదం మీద బీజేపీ స్పష్టత ఇవ్వాలి
- హైదరాబాద్‌కు కాంగ్రెస్ హయాంలో 25 కేంద్ర సంస్థలు
- మోదీ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలి
- ప్రధాని మోదీకి జవాన్ల ప్రాణాల పట్ల గౌరవముందా?
- పహల్గామ్ దాడిపై ఆల్ పార్టీ మీటింగ్‌కు గైర్హాజరైన ప్రధాని
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటివరకు 42 దేశాలను సందర్శించారని, కానీ భారత్‌లో మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండపై ఇప్పటివరకు ఒక్కసారి కూడా అడుగుపెట్టలేదని మండిపడ్డారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడిపై ఆల్ పార్టీ సమావేశం జరిగిన సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రచారాల్లో మునిగిపోయారని ఖర్గే మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన "సామాజిక న్యాయ సమర బేరి" సభలో ఆయన మాట్లాడారు. "మేము జవాన్ల కోసం పోరాడుతుంటే మోదీ ఓట్లు అడుగుతున్నారు. పహల్గామ్ ఘటనను కూడా ప్రజాసంబంధాల ఆటగా చూస్తున్నారు" అని ఖర్గే మండిపడ్డారు. "ఇందిరా గాంధీ నడుం వంచలేదు. బెంగాల్‌ను విమోచించారు. కానీ మోదీ మాట్లాడతారు తప్ప చర్యలు తీసుకోరు. అతడు ఎప్పుడూ క్షమాపణలు చెప్పే నేత" అని వ్యాఖ్యానించారు. "చైనా, పాకిస్తాన్‌తో పాటు నేపాల్ వంటి మిత్ర దేశాలూ మనకు దూరమయ్యాయి. అయినా మోదీ అన్నీ బాగున్నట్లు నటిస్తారు" అని అన్నారు.బీజేపీ రాజ్యాంగ విలువలను తక్కువ చేస్తోందని ఖర్గే విమర్శించారు. "సెక్యులర్ పదానికి వ్యతిరేకంగా మాట్లాడే ఆర్‌ఎస్‌ఎస్ అభిప్రాయాలు బీజేపీని కూడా ప్రభావితం చేస్తున్నాయి. అయినా బీజేపీ పార్టీ మేనిఫెస్టోలో 'సోషలిస్ట్, సెక్యులర్' పదాలు ఉన్నాయంటే ఇదే పరమవివక్ష" అని అన్నారు. "వెనుక ముందు లేకుండా ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ, ?15 లక్షల వాగ్దానాన్ని కూడా అమలు చేయలేదు" అని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్రను ప్రస్తావించిన ఖర్గే, "ఈ నగరానికి 25కు పైగా కేంద్ర సంస్థలు కాంగ్రెస్ హయాంలో వచ్చాయి. మోదీ ఈ నగరానికి చేసినదేమిటో బీజేపీ చెప్పాలి" అని ప్రశ్నించారు. గత 11 ఏళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ నాశనం చేశారని, రాజ్యాంగాన్ని కూల్చివేయాలని ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. "ఎవరైనా మోదీకి టోపీ లేదా పతకం ఇచ్చినా, ఆయన దాన్ని వేసుకుని చక్కర్లు కొడతారు. కానీ దేశంలోని రైతుల కష్టాల వైపు ఆయన చూపు లేదు. మోదీ జీ, మీరు ఎక్కడ ఉన్నారు? మీరు ఎనిమిది దేశాలు తిరుగుతున్నారు. కానీ, దేశ ప్రజల వైపు, రైతుల వైపు చూస్తే మేలుంటుంది," అని ఖర్గే వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దేశ భద్రత, ప్రజల హక్కుల పరిరక్షణ విషయంలో కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండిందని అన్నారు. "దేశం కోసం ప్రాణాలు త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్న పార్టీ కాంగ్రెస్ మాత్రమే. గాంధీ కుటుంబం నుంచి ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశానికి బలిదానం చేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లో అలాంటి త్యాగాలు చేసిన వారెవ్వరైనా ఉన్నారా?" అంటూ ప్రశ్నించారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కార్యకర్తలే ప్రధాన కారణమన్నారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క నేతృత్వంలో పార్టీ ఐక్యతగా పని చేసిందని కొనియాడారు. కేసీఆర్‌ను ఓడించి, కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చినందుకు కార్యకర్తలను అభినందించారు. గతంలో కేసీఆర్ రైతులను, మహిళలను, నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం, రైతు భరోసా ద్వారా రూ.8,200 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. దేశంలో తొలిసారి కులగణన చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందని చెప్పారు.

## రాష్ట్రంలో నియోజకవర్గాలు పెరుగుతాయి

- 153కు పెరగనున్న స్థానాలు
- కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా 15 పార్లమెంట్, 100 అసెంబ్లీ స్థానాలు గెలుస్తుంది
- వచ్చే ఎన్నికల్లో మహిళ రిజర్వేషన్లు అమలు
- సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాబోయే ఎన్నికల సమయానికి రాష్ట్రంలో నియోజకవర్గాలు పెరుగుతాయని.. కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా 15 పార్లమెంట్, 100 అసెంబ్లీ స్థానాలు గెలుచుకొని తిరిగి అధికారంలోకి వస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఎల్బీస్టేడియంలో నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి సభలో మాట్లాడారు.

ఇప్పటి వరకు అన్ని ఎన్నికల్లో కార్యకర్తలు తమను గెలిపించారని.. ఇక వచ్చే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలను, స్థానిక నాయకులను గెలిపించే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి 119గా ఉన్న సీట్లు 150కిపైగా అవుతాయని.., పార్లమెంట్ సీట్లు కూడా పెరగబోతున్నాయని.. మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయని చెప్పారు. అంతే కాకుండా ఐదారుగురు మంత్రులుగా వచ్చే అవకాశం కూడా ఉందన్నారు. కార్యకర్తలకు అన్ని పదవులు దక్కే వరకూ విశ్రాంతి తీసుకోబోనని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని.. దాని కంటే ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యతని చెప్పారు. అలాగే వచ్చే ఎన్నికల్లో మహిళ రిజర్వేషన్లు అమలు అవబోతున్నాయని.. దీంతో

మిగితా 4వ పేజీలో

## బీఆర్ఎస్ నాయకులతో కేసీఆర్ ఇష్టాగోష్టి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం గురువారం యశోద దవాఖానలో అడ్మిటైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శించేందుకు పార్టీ నేతలు పలువురు వచ్చారు. ఈ సందర్భంలో.. వారితో అధినేత కేసీఆర్ ఇష్టాగోష్టి నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, రైతులకు యూరియా, ఎరువుల లభ్యత, వ్యవసాయం, సాగునీరు, తదితర ప్రజా సమస్యలు.. వర్తమాన అంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ నేతలు, ఉద్యమకారుల నుంచి కేసీఆర్ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు.



## ఏనాడైనా బీసీని సీఎం చేశారా..

- 6 గ్యారంటీలు,మేనిఫెస్టోలోని 420 హామీలను ఎందుకు అమలు చేయడం లేదు..
- మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీల గొంతు వినిపిస్తుండ్రు.
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లపాటు అధికారాన్ని చెలాయించిన కాంగ్రెస్ పార్టీ,ఒక్క బీసీనైనా సీఎం చేయలేదు అని, బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారని ప్రకటించిన నేత మోదీ అని, తెలంగాణ లో 50శాతానికిపైగా బీసీ జనాభా ఉందని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర కేబినెట్ లో ఎంత మంది బీసీలకు అవకాశమిచ్చారో చెప్పాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో 5 కోట్ల 14 లక్షల రూపాయలతో చేపట్టిన అదనపు మౌలిక వసతుల నిర్మాణం పనులకు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి శంకుస్థాపన చేసి, భూమి పూజ నిర్వహించారు.సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 20 వేలకుపైగా గిరిజన జనాభా ఉన్న మండలాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఎందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నాదని, 728 స్కూల్స్ లక్ష్యం కాగా, దాదాపు 500 స్కూల్స్ ప్రారంభమయ్యాయని,1.5 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు.

సమాజంలో పూర్తిగా వెనుకబడ్డ ఆదివాసీ, గిరిజనులకు నవోదయ స్థాయిలో విద్యను అందించడం ద్వారా సమాజంలోని అసమానతలను తొలగించి విద్యలో సమానత్వం సాధించాలన్నదే ఈ ఏకలవ్య స్కూల్స్ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు.తెలంగాణా వ్యాప్తంగా మొత్తం 23 పాఠశాలల్లో సుమారు 10 వేల మంది విద్యార్థులు ఉన్నారని, మొత్తంగా 3 లక్షల 50 వేల మంది గిరిజన, ఆదివాసీ విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చాలని కేంద్ర లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా చర్యలు తీసుకుంటోందని అన్నారు.మహిళలకు నెలనెలా రూ.2500లు, రూ.4 వేల ఆసరా పెన్షన్లు, రూ.4వేల నిరుద్యోగ భ్రుతి, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇవ్వకుండా, 6 గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోలోని 420 హామీలను అమలు చేయకుండా అని, ఏం ఉద్ధరించిరని 'సామాజిక న్యాయ సమర భేరీ' సభను పెట్టారని అన్నారు.కాంగ్రెస్ ఏం ఉద్ధరించిందని ఈ సభను పెడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.ఈ దేశాన్ని అర్ధశతాబ్దానికిపైగా కాంగ్రెస్ పాలించింది, ఇన్నేళ్లలో ఒక్కసారైనా బీసీని ప్రధానమంత్రిని చేశారా అని ప్రశ్నించారు. బీజేపీ బీసీని ప్రధానిని చేసింది, దళిత వర్గానికి చెందిన రామ్ నాథ్ కోవింద్ ను, ఆదివాసీ బిడ్డ ద్రౌపది ముర్మును, మైనారిటీకి చెందిన అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా చేసిన ఘనత కూడా బీజేపీదే అని అన్నారు.

మిగితా 2వ పేజీలో

## ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులకు కొత్త నిబంధనలు

- జులై 15 నుంచి అమల్లోకి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) క్రెడిట్ కార్డు వినియోగదారులకు సంబంధించి ముఖ్యమైన మార్పులను ప్రకటించింది. ఎంపిక చేసిన కార్డులపై వర్తించే ఈ కొత్త నిబంధనలు జూలై 15 నుంచి అమలులోకి రానున్నాయి. ఇందులో భాగంగా కనీస చెల్లింపు లెక్కింపు విధానంతోపాటు, చెల్లింపుల సర్దుబాటు పద్ధతిలో మార్పులు జరిగాయి. అలాగే ఆగస్టు 11 నుంచి కొన్ని కార్డులపై ప్రమాద బీమా సదుపాయాన్ని కూడా రద్దు చేయనున్నారు. ప్రస్తుతం వినియోగదారులు ఆలస్య రుసుములు తప్పించుకునేందుకు "కనీస చెల్లింపు మొత్తం" చెల్లించటం ద్వారా స్వల్ప భద్రత పొందుతున్నారు. కానీ కొత్త నిబంధనల ప్రకారం, ఇకపై బకాయిపడిన మొత్తం శాతానికి తోడు జీఎస్‌టీ, ఈఎంఐ, ఇతర ఛార్జీలను కూడా కలిపి కనీస చెల్లింపు మొత్తాన్ని లెక్కించనున్నారు. దీంతో వినియోగదారులకు గణనీయంగా ఎక్కువ మొత్తం చెల్లించాల్సి రావచ్చు. లేకపోతే వడ్డీ భారం భారీగా పెరిగే అవకాశం ఉంది.

జూలై 15 నుంచి వినియోగదారులు చేసిన చెల్లింపులు ముందుగా జీఎస్‌టీ, ఈఎంఐ, ఇతర ఛార్జీలకు కేటాయించబడతాయి. ఆ తర్వాత మాత్రమే కొనుగోళ్లకు లేదా నగదు విత్‌డ్రాలపై ఉన్న బకాయిలకు వినియోగించబడతాయి. ఈ మార్పు వలన వడ్డీ చెల్లింపులు మరింత పెరిగే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆగస్టు 11 నుంచి యూకో బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పీఎస్‌బీ, కర్వ్ విపి (%ఖఐదీ%), సౌత్ ఇండియన్ బ్యాంక్‌లతో సహా కో-బ్రాండెడ్ ఎలైట్, ప్రైమ్ కార్డులపై అందిస్తున్న కాంప్లిమెంటరీ ఎయిర్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌ను ఎస్‌బీఐ రద్దు చేయనుంది. ప్రస్తుతం ఈ బీమా సౌకర్యం క్రింద రూ.50 లక్షల నుంచి రూ.1 కోట్ల వరకు కవరేజీ లభిస్తోంది. ఈ మార్పుల నేపథ్యంలో ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు వినియోగదారులు కొత్త నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని, అవసరమైతే ఇతర ఆప్షన్లను పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయండి

**తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశంలో ఖర్గే పిలుపు**

**బలగం టీవి, హైదరాబాద్**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలుచుకోవాలని, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పార్టీ బలం చాటాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. బుధవారం గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సమావేశం జరిగింది. రెండు గంటలపాటు కొనసాగిన ఈ సమావేశానికి ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశ ప్రారంభంలో సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో మృతుల కోసం మౌనం పాటించి సంతాపం తెలిపారు.




ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ నేతల మధ్య విభేదాలుంటే పార్టీలోని చర్చించుకోవాలని బయట మాట్లాడవద్దని హెచ్చరించారు. ప్రతిపక్ష పార్టీలకు అవకాశం ఇవ్వవద్దని సమస్యలుంటే ఇన్ చార్జి నేతలతో కో ఆర్డినేట్ చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పార్టీ సంస్థాగత నిర్మాణం, జిల్లాల్లో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలు, జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలు, సంవిధన్ బచావో కార్యాచరణ ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించారు.

# లక్డీకాపూల్‌లో రోశయ్య విగ్రహావిష్కరణ

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కలిసి ఆవిష్కరణ**

**బలగం టీవి, హైదరాబాద్**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, క్రమశిక్షణావంతుడు, ప్రజావాది నేతగా గుర్తింపు పొందిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య గారి విగ్రహాన్ని లక్డీకాపూల్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే కలిసి విగ్రహావిష్కరణ చేశారు. కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ సందర్భంగా రోశయ్య సేవలను నేతలు స్మరించుకున్నారు. ఆయన అందించిన సేవలు, నిరంతర ప్రజా క్షేమ పరిరక్షణకు కట్టుబాటు, ఆర్థిక విషయాల్లో నిపుణత్వాన్ని కొనియాడారు. కుటుంబ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు ఈ సందర్భంగా హాజరై, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎర్రవల్లి రైతుల భూములకు వెంటనే నీరు విడుదల చేయండి

- **కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశం**

**బలగం టీవి, హైదరాబాద్**



సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు కింద ఉన్న ఎర్రవల్లి గ్రామ రైతుల వ్యవసాయ భూములకు తక్షణమే సాగునీరు అందించాలంటూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఎర్రవల్లి గ్రామానికి చెందిన రైతులు తమ సాగునీటి సమస్యలపై రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల నుంచి సమాచారం తెలుసుకున్న కోదండరెడ్డి, వెంటనే ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో మంత్రి సంబంధిత అధికారులను సంప్రదించి సిద్దిపేట జిల్లాలో సాగునీటి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు నుంచి ఎర్రవల్లి గ్రామ రైతుల పంటలకు నీటిని విడుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతుల పంటలు వేళకు నీరు లేక పొలాల బోగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఈ నిర్ణయం రైతుల్లో నూతన ఆశలు నింపింది. త్వరలోనే నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు సమాచారం.

# నిర్మాత అల్లు అరవింద్‌ను విచారించిన ఈడీ

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను శుక్రవారం ఈడీ అధికారులు విచారించారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ కుంభకోణం కేసుకు సంబంధించి విచారణకు రావాలని అధికారులు కోరడంతో శుక్రవారం అల్లు అరవింద్ ఇడి విచారణకు హాజరయ్యారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ స్కామ్‌లో అధికారులు సుమారు అల్లు అరవింద్‌ను మూడు గంటల పాటు ప్రశ్నించారు. ఈ కేసులో 2018,19 సంవత్సరాల మధ్యకాలంలో రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రుణం తీసుకుని ఎగవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ రుణ నిధులను సంస్థ యజమానులు సొంత ప్రయోజనాలకు, అక్రమ నగదు బదిలీకి ఉపయోగించినట్లు ఇడి గుర్తించింది. ఇందులో మనీ లాండరింగ్ కోణం ఉందని భావించి ఇడి విచారణ చేపట్టింది. ఈ విచారణలో రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ సంస్థలకు, అల్లు అరవింద్‌కు చెందిన సంస్థలకు మధ్య కొన్ని అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఇడి అధికారులు గుర్తించారు. అల్లు అరవింద్‌ను విచారించిన అధికారులు బ్యాంకు లావాదేవీలు, ఆస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలిసింది. అనంతరం అధికారులు మరోసారి విచారణకు హాజరు కావాలని అల్లు అరవింద్‌కు ఆదేశాలు జారీ చేశారని సమాచారం. కాగా, 2024 సంవత్సరంలో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహించి రూ. 1.45 కోట్లను సీజ్ చేసింది. నింధితులు రూ. 101.48 కోట్ల రుణాలకు సంబంధించిన నిధులు మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు నేపథ్యంలో ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది.

# రొటీన్ హెల్త్ చెకప్‌లో భాగంగా ఆస్పత్రిలో చేరిన కేసీఆర్

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "రొటీన్ హెల్త్ చెకప్‌లో భాగంగా కేసీఆర్ గారు ఆసుపత్రిలో చేరారు. బ్లడ్ షుగర్, సోడియం లెవెల్స్ మానిటర్ చేయడం కోసం డాక్టర్ల సూచన మేరకు రెండు రోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. ఆయన ఆరోగ్యం గురించి ఆరాతీస్తూ క్షేమంగా ఉండాలని ఆకాంక్షించిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు," అని కేటీఆర్ తెలిపారు. వైద్యులు విడుదల చేసిన బులిటెన్ ప్రకారం, కేసీఆర్ శరీరంలో బ్లడ్ షుగర్ స్థాయి అధికంగా, సోడియం స్థాయి తక్కువగా నమోదైనట్లు ప్రాథమిక పరీక్షల్లో వెల్లడైనట్టు చెప్పారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటున్న కేసీఆర్ ఆరోగ్యం స్థిరంగా ఉందని స్పష్టం చేశారు.

# ఏనాడైనా బీసీని సీఎం చేశారా..

(మొదటి పేజీ తరువాయి)

చరిత్రలో ఎన్నడూలేని విధంగా 27 మంది ఓబీసీలను, 12 మంది దళితులను, 6గురు దళితులను, 8 మంది మహిళలను కేంద్ర కేబినెట్ లో చోటు కల్పించిన చరిత్ర బిజెపిది అని అన్నారు. బీసీనైన నన్ను కేంద్ర మంత్రిగా చేసింది,పార్టీ పరంగా నాతోపాటు లక్ష్మణ్, దత్తాత్రేయలకు అనేక పదవులిచ్చింది బీజేపీ అని,బీసీకి చెందిన మోదీని ప్రధాని అయితే,చాయ్ వాలా అంటూ హేళన చేసిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. బీసీ నేత పొన్నం ప్రభాకర్ కు పదవి ఇస్తే బీసీల గొంతు విన్పించారని,మరింత మంది బీసీలకు ఇస్తే న్యాయం జరిగేది కదా అన్నారు.మరి ఏ ముఖం పెట్టుకుని సామాజిక న్యాయ సమరభేరి సభ పెడుతున్నారని,బీసీల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ కు లేదు అని అన్నారు.యూరియా కొరతపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కావాలనే కేంద్రాన్ని బదనాం చేస్తున్నాయని, లోకల్ బాడీ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధమవుతుంటే ఓర్వలేక బదనాం చేస్తున్నారని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుభవజులని,అధికారులు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారని, వాస్తవాలు గ్రహించాలని అన్నారు.తెలంగాణకు గత సీజన్ లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే, కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చిందని, అదనంగా దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా ఇచ్చిందని అన్నారు.ఈ సీజన్ లో కూడా కోరినంత యూరియా ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని,కానీ గత సీజన్ లో అదనంగా కేటాయించిన యూరియా ఎటు పోయింది, వాటిని ఏం చేశారో లెక్కలు చెప్పకుండా కేంద్రాన్ని బదనాం చేయడం సరికాదు అని అన్నారు.ఈ విషయంలో అడ్డదారులు పడితే తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని,మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభ్యర్థనను కూడా కేంద్రం సానుకూల ధోరణితో పరిశీలించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఇక్కడ బిజెపి జిల్లా అధ్యక్షులు గోపి, బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాపరామకృష్ణ, ఎర్రం మహేష్, అల్లాడి రమేష్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డీవైఎఫ్ఐ చలో సెక్రటేరియట్ ఉద్రిక్తం..

- **పలువురు అరెస్ట్..**
- **అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలింపు..**

**బలగం టీవి, హైదరాబాద్**



జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యువజన సంఘాలు ఇచ్చిన పిలుపులో బాగంగా శుక్రవారం పాతబస్తీ నుండి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఛలో సెక్రటేరియట్ చేపట్టిన కార్యక్రమం ఉద్రిక్తంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంతో మరింత ఉద్రిక్తంగా మారింది. దీంతో యువతకు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు తక్షణమే విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని నినాదాలు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తక్షణం ఉద్యోగ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు వేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆగిరి. వెంకటేష్ అన్నారు. ఆయనతో పాటు డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జావేద్, ఏ కృష్ణ, జిల్లా నాయకులు ఎస్.విను, ఆర్.శ్రీను, ఎం.రాజేష్, రాజు, తదితర యూత్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ కు పోలీసులు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కేవలం 50వేల పోస్టులు మాత్రమే ఈ 19 నెలల్లో భర్తీ చేశారన్నారు. మొదటి ఏడాది లోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. వాటి నోటిఫికేషన్, జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయడంలో జాప్యం చేస్తుం దన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్లు వేసే వరకు ఈ పోరాటం వివిధ రూపాల్లో కొనసాగుతుందని హెచ్చరించారు. ఉద్యోగుల నోటిఫికేషన్ విడుదల చేయాలని న్యాయ పోరాటం చేస్తున్న యువ నేతలను, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని సీపీఐ(ఎం) గోషామహల్ జోన్ కన్వీనర్ పి.నాగేశ్వర్, పూర్వ డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు మహేందర్, విజయ్, కేవీపీఎస్ నాయకులు ఎం సి రాములు తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ అయిన నేతలను వీరు పరామర్శించారు.

# నిరుద్యోగుల అరెస్టులు దుర్మార్గం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**



"ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై నిలదీసేందుకు వచ్చిన నిరుద్యోగులను అరెస్టు చేయడం దుర్మార్గం" అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉడుతగొట్టి చేసిన ఉద్యోగ హామీలపై ప్రశ్నించే హక్కు నిరుద్యోగులకుందన్నారు. అశోక్‌నగర్ చౌరస్తాలో "చాయ్ పే చర్చ" పేరిట నిరుద్యోగులతో కలసి కూర్చొన్న రేవంత్ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్‌ను మరచిపోయారని విమర్శించారు. "చలో సచివాలయం" కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులను ముందుగానే నిర్బంధించడమే కాక, సచివాలయానికి వచ్చిన వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. కేటీఆర్ మాట్లాడుతూ, "యూత్ డిక్లరేషన్ పేరిట ఢిల్లీ పెద్దలను పిలిపించి మోసం చేశారు. ఏడాదిన్నర కాలంలో కనీసం పది వేల ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్ ఇవ్వని ప్రభుత్వం, నిరుద్యోగులను వెన్నుపోటు పొడిచినట్లే. బీఆర్ఎస్ హయాంలో ప్రక్రియ పూర్తిచేసిన 60,000 ఉద్యోగాలకు అప్పాయింట్‌మెంట్‌లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు" అన్నారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రెండు లక్షల ఉద్యోగాల హామీ ఇప్పటికీ నెరవేర్చని ప్రభుత్వం, నిరుద్యోగులు "నోటిఫికేషన్లు వద్దంటున్నారు" అనే వాదనను తిప్పికొట్టారు. అది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. "ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే, రాష్ట్రంలోని లక్షలాది నిరుద్యోగుల తరఫున బీఆర్ఎస్ ఉద్యమ కార్యాచరణ చేపడుతుంది. ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ద్రోహాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం," అని కేటీఆర్ హెచ్చరించారు. అక్రమ అరెస్టులు తక్షణమే ఉపసంహరించాలని, నిరుద్యోగులను బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# మహనీయుల సేవలు చిరస్మరణీయం

**-ఘనంగా రోశయ్య జయంతి, దొడ్డి కొమురయ్య వర్ధంతి**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మహనీయుల సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ మరియు జిల్లా యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి, దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను నిర్వహించగా, రోశయ్య, కొమరయ్య చిత్రపటానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో డి.వై ఎస్ ఓ రాందాస్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రాజ మనోహర్ రావు,జిల్లా అధికారులు , సిబ్బంది, ఆయా కుల సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య మోడల్ స్కూల్ వంట గది తనిఖీ

**-హాస్టళ్ల పరిసరాలు, వంటగదులు, ఆహార పదార్థాల పరిశీలన**

**బలగం టీవీ,కొనరావుపేట**



కొనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రోగ్రాం కు ముందుగా హాస్టళ్ పరిసరాలు, కిచెన్, నిలువ చేసిన ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలు, బియ్యం, త్రాగు నీరు, తదితర అంశాలు తనిఖీ చేసారు.

# విద్యార్థులకు సిలబస్ గా పెద్దింటి ఉద్యమనవల

**బలగం టీవీ, సిరిసిల్ల**




రాష్ట్రంలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో ఎమ్మే రెండవ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశముగా ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ రాసిన లాంగ్ మార్చ్ నవల ఎంపికయింది. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో రాసిన ఈ లాంగ్ మార్చ్ నవలను అధ్యయనం చేయనున్నారు. ఇప్పటికే ఈ నవల ఉస్మానియా యూనివర్సిటీలో సిలబస్ గా ఉంది. దీనితోపాటు నల్గొండలోని నాగార్జున కళాశాల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం మానవ సంబంధాలపై పెద్దింటి రాసిన ప్రముఖ నవల జిగిరి పాఠ్యాంశంగా పెడుతున్నారు. ఈ నవల 12 భాషల్లోకి అనువాదమై వివిధ కళాశాలల్లో సిలబస్ గా ఉంది. ఈ రెండు నవలలు త్వరలో సినిమాలుగా రానున్నాయి. తెలంగాణ మట్టి జీవితాలను కథలుగా నవలలుగా నాటకాలుగా సినిమాలుగా ఆవిష్కరిస్తున్న పెద్దింటి అశోక్ కుమార్ సిరిసిల్ల పట్టణంలో రాజీవ్ నగర్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు



# 17వ పోలీస్ బెటాలియన్‌లో కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు..

**బలగం టీవీ, సర్దాపూర్,**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లా సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ ఎం.ఐ. సురేష్ రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ, రోశయ్య 1933 జూలై 4న గుంటూరు జిల్లా వేమూరు గ్రామంలో జన్మించారని తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన ఆయన, 1978 నుండి 2009 వరకు పలుసార్లు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో అత్యధిక కాలం ఆర్థిక మంత్రిగా పనిచేసిన రోశయ్య మొత్తం 15 సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం విశేషం. ఇందులో చివరి ఏడు సార్లు వరుసగా ప్రవేశపెట్టి, బడ్జెట్ కూర్పులో ఘనపాటిగా పేరు పొందారని కమాండెంట్ సురేష్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలిలో సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవమున్న రోశయ్య, 2009 సెప్టెంబర్ 3 నుండి 2010 నవంబర్ 24 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారని, ఆ తరువాత తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాలకు గవర్నర్‌గా కూడా పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ జగదీశ్వరరావు, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తిచేసుకుని...

## ప్రభుత్వ సాయం పొందండి..



**బలగం టీవీ, సిరిసిల్ల**

ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం పొందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గంభీరావుపేట మండలం గోరంటాల, ఎల్లారెడ్డిపేట మండలం గుండారం, వీర్నపల్లి మండలాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని,నిర్ణీత స్థలంలో ఇండ్లు నిర్మించుకోవాలని సూచించారు. విడతల వారిగా మొత్తం రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు అధికారులు సహకరించాలని సూచించారు. గోరంటాలలో ఇందిరమ్మ ఇండ్ల పనుల్లో జాప్యం అవుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. వీర్నపల్లి ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు పరిశీలించి, అధికారులను అభినందించారు.

- **చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి..**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి..గంభీరావుపేట మండలం గోరంటాలలో లోతు వాగు వద్ద చెక్ డ్యాం నిర్మాణానికి స్థలాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లోతు వాగు వద్ద చెక్ డ్యాం నిర్మాణానికి సర్వే చేయాలని, నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటన లో డీఆర్డీఓ శేషాద్రి, ఎంపీడీవోలు తాసిల్దార్లు, సంబంధిత అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ మండల సమాఖ్య సేవలు భేష్..

- **ఆత్మ నిర్భర్ సంఘాతన్ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఇల్లంతకుంట మండలము ఆదర్శ మహిళా సమాఖ్య సేవలు భేష్ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. ఈ మండల సమాఖ్య కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆత్మ నిర్భర్ సంఘాతన్ అవార్డుకు ఎంపిక కాగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య బ్యాంకు రుణాల అందజేత, రికవరీ, క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడం పై అభినందించారు.

**నిరంతర ఆదాయానికి గ్యాస్ ఏజెన్సీ మంజూరు**

ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్యకు నిరంతరం ఆదాయం వచ్చేలా గ్యాస్ ఏజెన్సీ మంజూరు చేయాలని డీఆర్డీఓ శేషాద్రిని కలెక్టర్ ఆదేశించారు. గ్యాస్ ఏజెన్సీతో మండల సమాఖ్య ఆర్థికంగా మరింత బలపడుతుందని పేర్కొన్నారు. మండల సమాఖ్య బాధ్యులు ఎస్ హెచ్ జీ సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తీర్చిదిద్దేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, డిపిఎం. వంగ రవీందర్, ఏపీఎం వాణి ఎస్ హెచ్ జీ సభ్యులు, తగితరులు ఉన్నారు.

# దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన నేతాజీ

- **విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాల దిశగా ముందుకు వెళ్ళాలి**
- **సమాజ సేవే లక్ష్యంగా నిరంతరం పని చేస్తున్నాం**
- **ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్**



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రం లో ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యం లో స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు మొదటి ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఆతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ: గత 14 సంవత్సరాలుగా నిరంతరం సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తున్నామని , మహనీయుల యొక్క చరిత్రను విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేయడం కోసం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తూ, బహుమతులు ప్రదానం చేస్తున్నామని, భవిష్యత్తులో విద్యార్థినీ,విద్యార్థులు మహనీయులైన స్వామి వివేకానంద,నేతాజీ సుభాష్ చంద్రబోస్, డా.బి.ఆర్ అంబేత్కర్, గాంధీజీ స్ఫూర్తితోని ఎంచుకున్న లక్ష్యాల దిశగా ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించి, సామాజిక సేవలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలిపారు.యువజన సంఘాల అధ్యక్షులు అమిరిశెట్టి భూమిరెడ్డి మాట్లాడుతూ: విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాల దిశగా ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ విద్యానికేతన్ పాఠశాల చైర్మన్ బిళ్ళ ఆనందం, ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి బోయిని వేణు , సభ్యులు తాళ్ళపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఉచితంగా కూరగాయల నారు పంపిణీ..

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ నియోజకవర్గ ఉద్యాన శాఖ ద్వారా రైతు సోదరుల కోసం గొప్ప అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. టమాటో, వంకాయ, మిర్చి, క్యాబేజ్, కాలిఫ్లవర్ వంటి కూరగాయల నారును ఉచితంగా అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసక్తి ఉన్న రైతు సోదరులు వెంటనే దిగువ ఇచ్చిన మొబైల్ నెంబర్‌ను సంప్రదించగలరన్నారు. రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు,బ్యాంకు ఖాతా, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో వేములవాడ నియోజకవర్గ ఉద్యాన శాఖ అధికారి లోకేష్ ను సంప్రదించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్: 89777 14048. రైతుల మేలుకోసం ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# భారత్‌కు ఆధిక్యం

- 407 పరుగులకు ఇంగ్లండ్ ఆలౌట్
- 6 వికెట్లు తీసిన సిరాజ్
- మూడో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 64 పరుగులు చేసిన భారత్
- 244 పరుగుల ఆధిక్యం



**బలగం టీవీ, ఎడ్జ్‌బాస్టన్**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో భారత జట్టుకు ఆధిక్యం లభించింది. 180 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 64 పరుగులు చేసింది. దూకుడుగా ఆడిన యశస్వి జైస్వాల్ (22 బంతుల్లో 6 ఫోర్లతో 28) త్వరగా వెనుదిరిగినప్పటికీ, కేఎల్ రాహుల్ (28 బ్యాటింగ్), కరుణ్ నాయర్ (7 బ్యాటింగ్) జోడీ జాగ్రత్తగా ఆటను కొనసాగించింది. ప్రస్తుతం భారత్ మొత్తంగా 244 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. జోష్ టంగ్‌కు ఒక్క వికెట్ లభించింది.

అంతకుముందు 77/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగులకు ఆలౌటైంది. జెమీ స్మిత్ (207 బంతుల్లో 21 ఫోర్లు, 4 సిక్సులతో 184 నాటౌట్), హ్యారీ బ్రూక్ (234 బంతుల్లో 17 ఫోర్లు, 1 సిక్సుతో 158) శతకాలతో రాణించారు. ఈ జంట 6వ వికెట్‌కు 303 పరుగులు జోడించింది. చివరికి ఆకాశ్ దీప్ బ్రూక్‌ను క్లీన్ బౌల్డ్ చేసి ఈ భాగస్వామ్యానికి తెరదించాడు. భారత బౌలర్లలో సిరాజ్ 6 వికెట్లతో చెలరేగగా, ఆకాశ్ దీప్ 4 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగులు చేసింది. నాలుగో రోజు ఆటలో భారత్ మరింత ఆధిపత్యంగా ఆడితే 450-500 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ ఎదుట ఉంచే అవకాశం ఉంది. అయితే, ఎడ్జ్‌బాస్టన్ వికెట్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలంగా మారిన నేపథ్యంలో 400లోపు లక్ష్యం ఇంగ్లండ్ ఛేదించగలగడం తేలికవవచ్చు. కాబట్టి భారత జట్టుకు మరింత మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శన అవసరం.

**సంక్షిప్త స్కోర్లు:**

భారత్ తొలి ఇన్నింగ్స్: 587 ఆలౌట్ (శుభ్‌మన్ గిల్ 269బీ షోయబ్ బషీర్ 3/167)

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 407 ఆలౌట్ (జెమీ స్మిత్ 184 నాటౌట్, హ్యారీ బ్రూక్ 158బీ సిరాజ్ 6/70, ఆకాశ్ దీప్ 4/88)

భారత్ రెండో ఇన్నింగ్స్: 64/1 (13 ఓవర్లు, జైస్వాల్ 28, రాహుల్ 28లి, కరుణ్ నాయర్ 7లి)

# రాష్ట్రంలో నియోజకవర్గాలు పెరుగుతాయి

(మొదటి పేజీ తరువాయి)

మహిళలకు ఎక్కువ అవకాశాలు లభిస్తాయన్నారు. ఇక వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 100 స్థానాలు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 100 కంటే ఒక్క సీటు తగ్గినా నాదే బాధ్యత అని అన్నారు. అలాగే తెలంగాణలో 15 పార్లమెంట్ స్థానాల్లో దక్కించుకుంటామని జోస్యం చెప్పారు.

కొత్తగా ఎమ్మెల్యేలు వచ్చిన చోట పాత నేతలు బాధపడకండని.. మీకు టికెట్లు ఇచ్చి ఎమ్మెల్యేలుగా గెలిపించే బాధ్యత పార్టీ చూసుకుంటుందని భరోసా ఇచ్చారు. మంత్రులుగా చేసే బాధ్యత ఖర్గే, రాహుల్ గాంధీ చూసుకుంటారన్నారు. నేతలు టికెట్ల కోసం ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదని.. మీకు టికెట్లు ఇచ్చి దారిఖర్చులు కూడా ఇచ్చి పంపుతామని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

తమకు ఎదురులేదని భావించిన కల్వకుంట్ల గడీని బద్దలు కొట్టామని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన సాగిస్తున్నామని, ఇదే తరహా పాలన రాబోయే రోజుల్లోనూ సాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని, తామంతా కొట్టుకుంటామని.. కలిసి ఉండలేమని విపక్షాలు చేసిన ఆరోపణలను తప్పని నిరూపించామన్నారు. కాంగ్రెస్ నేతలు ఐకమత్యంతో పని చేస్తూ అపోహలను పటాపంచలు చేశారన్నారు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం, చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి ఎవరొచ్చినా సరే.. మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్నాం.. వారిని వ్యాపారవేత్తలుగా మారుస్తున్నామన్నారు. జనగణనతో పాటు కులగణన చేస్తామని, ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాట ఇచ్చారని, హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించామన్నారు. ఈ సమయంలో కష్టాలు వచ్చాయని, ఒడిదొడుకులు వచ్చాయని, అయినా అన్నింటిని అధిగమించి ముందుకెళు_న్నామన్నారు.



# పైరసీపై కఠిన చర్యలు: దిల్‌రాజు

## ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్న ఎఫ్‌డీసీ

**బలగం టీవీ, హైదరాబాద్**

సినీ పరిశ్రమను భాదిస్తున్న పైరసీ పైరసీ నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు తెలిపారు. బుధవారం ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్ ప్రియాంకతో కలిసి సమాచార శాఖ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. "రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రితో పలు కీలక సమావేశాలు నిర్వహించాం. సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. అవసరమైతే కొత్త నిబంధనల రూపకల్పన కూడా చేస్తాం," అని తెలిపారు. పైరసీ నియంత్రణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. "ఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేస్తాం. సినిమా షఉటింగ్‌లకు ఆన్‌లైన్ అనుమతుల ప్రక్రియతోపాటు వీడియో పైరసీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటాం" అని దిల్‌రాజు వివరించారు. ఎఫ్‌డీసీ ఎండీ సిహెచ్ ప్రియాంక మాట్లాడుతూ, "సినిమా జర్నలిస్టుల అక్రిడిటేషన్ అంశంపై సమీక్ష చేపట్టాం. సాధ్యాసాధ్యాలపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. పరిశ్రమలోని ఎవరైనా తమ సమస్యలను మా దృష్టికి తీసుకురావాలంటే, వాటి పరిష్కారానికి కచ్చితంగా ప్రయత్నిస్తాం" అని హామీ ఇచ్చారు.

# తెలుగులో 'మై బేబి'గా రాబోతున్న తమిళ సూపర్‌హిట్ చిత్రం 'డి.ఎన్.ఎ'

**బలగం టీవీ, హైదరాబాద్**




ఇటీవల తమిళంలో విడుదలై భారీ విజయం సాధించిన 'డి.ఎన్.ఎ' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ కొండేటి ఈ చిత్రాన్ని 'మై బేబి' పేరుతో ఈనెల జూలై 11న విడుదల చేయనున్నారు. గతంలో 'ప్రేమిస్తే', 'జర్నీ', 'షాపింగ్ మాల్', 'పిజ్జా' వంటి 15 విజయవంతమైన చిత్రాలను నిర్మాతగా అందించిన సురేష్ కొండేటి, డిస్ట్రిబ్యూటర్‌గా 85కు పైగా సినిమాలను విడుదల చేశారు. 'మై బేబి' ఆయన నిర్మాణంలో వస్తున్న 16వ చిత్రం. ఈ సినిమా కూడా భారీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తమిళంలో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అథర్వ మురళి, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్, భావోద్వేగాలతో కూడిన కథాంశంతో ప్రేక్షకులను కట్టిపడేసింది. 2014లో ఒక సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ కథ రూపొందింది. పిల్లల అపహరణలు, ఆసుపత్రులలో పిల్లలను మార్చడం వంటి సున్నితమైన సామాజిక సమస్యలను ఈ చిత్రం స్పృశించిందని, ఇది సమాజంలో మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో మరోసారి గుర్తు చేస్తుందని చిత్ర బృందం పేర్కొంది.

# 'పుష్ప 2' రికార్డు బ్రేక్ చేసిన 'హరి హర వీరమల్లు'

**బలగం టీవీ, హైదరాబాద్**




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు ట్రైలర్ గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ విడుదలైన 24 గంటల్లోనే అద్భుతమైన రికార్డులను సృష్టించి టాలీవుడ్‌లో సరికొత్త చరిత్రను లిఖిస్తుంది. ఇప్పటివరకు 24 గంటల్లో యూట్యూబ్‌లో అత్యధిక వ్యూస్ సాధించిన ట్రైలర్‌గా అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 పేరిటా ఈ రికార్డు ఉండగా.. ఇప్పుడది హరి హర వీరమల్లు సొంతం చేసుకుంది. ఈ చిత్రం కేవలం 24 గంటల్లో తెలుగులో మాత్రమే 48 మిలియన్లకు పైగా (4.8 కోట్ల) వ్యూస్ సాధించి, తెలుగు చిత్ర పరిశ్రమలో 24 గంటల్లో అత్యధిక వ్యూస్ పొందిన ట్రైలర్‌గా నిలిచింది. అలాగే అన్ని భాషల్లో కలిపి ఈ ట్రైలర్ 61.7 మిలియన్లకు పైగా (6.17 కోట్ల) వ్యూస్ సాధించిందని చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. దీంతో టాలీవుడ్ చరిత్రలో ఈ రికార్డు సాధించిన మొదటి చిత్రంగా హరి హర వీరమల్లు రికార్డులకెక్కింది.




# సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి 'స్పిరిట్'

**బలగం టీవీ, హైదరాబాద్**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజా సాబ్' చిత్ర షూటింగ్ చివరి దశలో ఉండగా హను రాఘవపూడితో 'ఫౌజీ' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇక ఈ సినిమాల తర్వాత ప్రభాస్ నెక్ట్స్ చిత్రం దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో చేయనున్నాడు.'స్పిరిట్' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాలో ప్రభాస్ ఓ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తాడు. అయితే, ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ నెలలో పట్టాలెక్కించేందుకు చిత్ర యూనిట్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

# ఫిష్ వెంకట్‌కు ప్రభాస్ సాయం

**బలగం టీవీ, హైదరాబాద్**



సినీ నటుడు ఫిష్ వెంకట్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వేళ, ఆయనకు అండగా నిలిచేందుకు యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ముందుకొచ్చారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్ ఆపరేషన్‌కు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రభాస్ బృందం హామీ ఇచ్చింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులు కాస్త ఊరట చెందారు. కొంతకాలంగా ఫిష్ వెంకట్ ఆరోగ్యం క్షీణించడంతో, ఆయనను బోడుప్పల్‌లోని ఆర్బీఎం ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.ప్రస్తుతం వెంకట్ పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారని ఆమె తెలిపారు. ఇందుకు సుమారు రూ. 50 లక్షలు ఖర్చవుతుందని, దాతలు ఎవరైనా ఆదుకోవాలని ఆమె మీడియా ద్వారా వేడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న హీరో ప్రభాస్ బృందం వెంటనే స్పందించింది. ప్రభాస్ అసిస్టెంట్ తమకు ఫోన్ చేశారని, "కిడ్నీ ఇచ్చే దాతను సిద్ధం చేసుకోండి, ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు మొత్తం మేం చూసుకుంటాం" అని హామీ ఇచ్చారని స్రవంతి మీడియాకు వెల్లడించారు. ప్రభాస్ చూపిన ఉదారతకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తమ కుటుంబం కిడ్నీ దాత కోసం అన్వేషిస్తోందని స్రవంతి చెప్పారు. "నాన్న బ్లడ్ గ్రూప్‌తో నా రక్తం గ్రూప్ మ్యాచ్ కాలేదు. నాన్న తమ్ముడి గ్రూప్ మ్యాచ్ అయినా, ఆయనకు ఆరోగ్య సమస్యలు ఉండటంతో వైద్యులు వద్దన్నారు. దీంతో దాతల కోసం పలు సంస్థలను సంప్రదిస్తున్నాం" అని ఆమె వివరించారు.